సైకిల్‌కు పంక్చరేనా!

- మాజీ జెడ్పీటీసీ నళినీకాంత్ దూరం
- టీడీపీ గుండెల్లో గుబులు
- బుజ్జగింపు యత్నాలు విఫలం

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో సైకిల్‌కు పంక్చర్ తప్పదా అంటే అవుననే అంటున్నాయి టీడీపీ శ్రేణులు. ఈ ప్రాంతంలో ఆ పార్టీకి మిగిలిన కాసింత పట్టు కూడా సడలిపోతున్న పరిస్థితులే కనిపిస్తున్నాయి. చాగల్నాడు ప్రాంతం టీడీపీకి ఒకప్పుడు కంచుకోటగా ఉండేది. 2019 ఎన్నికల్లో ఆ కోట బద్దలైంది. అక్కడి నుంచి క్రమంగా ఆ పార్టీ కోట శిథిలమవుతోంది. తాజాగా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పెండ్యాల నళినీకాంత్ దూరం కావడంతో రానున్న ఎన్నికల్లో అక్కడ టీడీపీ కనీసం డిపాజిట్లయినా దక్కించుకోగలదా అన్న చర్చ సాగుతోంది. ఈ మొత్తం వ్యవహారానికి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వైఖరే కారణమని ఆ పార్టీ నేతలే బహిరంగంగా విమర్శిస్తున్నారు.

రంగంపేట మండలంలో పెండ్యాల రంగారావు కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుంచీ పార్టీకి కట్టుబడి పని చేసింది. సుదీర్ఘ కాలం టీడీపీ మండల అధ్యక్షుడిగా రంగారావు పని చేశారు. అనంతరం ఆయన కుమారుడు నళినీకాంత్ పార్టీని భుజాలపై వేసుకుని మోశారు. 2014లో రంగంపేట మండలంలో నళినీకాంత్ (చిన్నారి) జెడ్పీటీసీ సభ్యునిగా పోటీ చేసి మంచి



మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి సహకరించబోనంటూ బహిరంగ వేదికపై ప్రకటిస్తున్న మాజీ జెడ్పీటీసీ నళినీకాంత్

మెజార్టీతో గెలిచారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయానికి కూడా పాటుపడి గెలుపు తీరాలకు చేర్చారు. అనంతరం జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడి పదవి నళినీకాంత్‌ను వరించింది. అయితే ఆ తరువాత ఆయన ఎదుగుదలకు రామకృష్ణారెడ్డి అడ్డు పడుతున్నారని అప్పట్లో నళినీకాంత్ వర్గం పెదవి విరిచేది. 2019లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి, ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచీ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి నళినీకాంత్ దూరంగా ఉంటూ వచ్చారు. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి తాను కానీ, తన వర్గం కానీ సహకరించేది లేదని ఇటీవల తన పుట్టిన రోజు వేడుకల వేదికపై నళినీకాంత్ తెగేసి చెప్పేశారు. రామకృష్ణారెడ్డి తీరు వల్ల ఇన్నేళ్లూ తన మనసు గాయపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలే నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగా ఉండగా.. ఇప్పుడు నళినీకాంత్ దూరమైతే భారీగా ఓటింగ్ కోల్పోవడం ఖాయమని పార్టీ శ్రేణులు గుబులు చెందుతున్నాయి.

ప్లీజ్ ఏదోలా ఆపండి

తన రాజకీయ భవిష్యత్తుకు నళినీకాంత్ ఎక్కడ అడ్డుగా నిలుస్తారోనన్న భయంతో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆయనను చిన్నచూపు చూస్తున్నారన్న వాదన చాలా ఏళ్లుగా టీడీపీలో ఉంది. నళినీకాంత్ తాజా ప్రకటనతో రామకృష్ణారెడ్డి సైతం ఒక్కసారిగా సందిగ్ధంలో పడినట్టు తెలుస్తోంది. నళినీకాంత్ పార్టీ నుంచి జారిపోకుండా 'ప్లీజ్ ఏదోలా ఆపండి' అంటూ తనకు సన్నిహితంగా ఉండే నాయకుల్ని ఆయన రాయబారానికి పంపించినట్టు టీడీపీ వర్గాల సమాచారం. అయితే ఎంతమంది బుజ్జగించే ప్రయత్నం చేసినా నళినీకాంత్ మాత్రం ససేమిరా అంటున్నారని తెలుస్తోంది. తాజా పరిణామాలతో రంగంపేట మండలంలో టీడీపీ పూర్తిగా పట్టు కోల్పోవడమే కాకుండా.. వైఎస్సార్ సీపీ మరింతగా విజయఢంకా మోగించడానికి దోహదపడుతుందని ఆ పార్టీ శ్రేణులే బాహాటంగా చెబుతున్నాయి. ఈ పరిణామాలతో వైఎస్సార్ సీపీలో జోష్ మరింత పెరిగింది. వచ్చే ఎన్నికల్లో కూడా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి భారీ ఆధిక్యతతో గెలుపొందడం ఖాయమని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కేవలం రామకృష్ణారెడ్డి కారణంగానే నియోజకవర్గంలో టీడీపీ పుట్టి మునిగిపోతోందని టీడీపీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

అన్నం తింటారా... సరకులు కావాలా

- గర్భిణులు, బాలింతల మనోగతంపై సర్వే
- లబ్ధిదారుల నుంచి లిఖితపూర్వకంగా వివరాల సేకరణ

బిక్కవోలు: ఒకప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం వండి వేడి వేడిగా వడ్డించే వారు. కరోనా మహమ్మారి ఆ పరిస్థితి దూరంగా చేసింది. దీంతో తల్లులకు, పిల్లలకు ఇంటికే బియ్యం, నూనె, పప్పు, పాలు, గుడ్డు లాంటి సరకులు అందించేవారు. కరోనా తగ్గుముఖం పట్టాక మళ్లీ కేంద్రాల్లోనే భోజనం అందించేందుకు ప్రభుత్వం ఆదేశించింది. అయితే కేంద్రానికి రావడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. కేంద్రాల్లో వండిన అన్నం ఇంటికి తీసుకెళ్లమని చెప్పినా స్పందించడం లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో వండి వడ్డించాలా.. లేక సరకులే ఇంటికి ఇవ్వాలా అన్న అంశంపై క్షేత్రస్థాయిలో సర్వేకు శ్రీకారం చుట్టింది.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో మొత్తంగా 265 అంగన్‌వాడీ కేంద్రాలుంటే 1920 మంది గర్భిణులు, 1647 మంది బాలింతలు, 7621 మంది మూడేళ్లలోపు చిన్నారులు, 3984 మంది మూడు నుంచి ఆరేళ్ల వయసు


పందలపాకలో గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం


కొమరిపాలెంలో పౌష్టికాహారం తీసుకుంటున్న చిన్నారులు

చిన్నారులున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇప్పటికే నాలుగు అంశాలతో కూడిన సర్వేను ఆయా అంగన్‌వాడీ కేంద్రాలన్నింట్లో నిర్వహించి లబ్ధిదారుల నుంచి లిఖితపూర్వకంగా వివరాలు సేకరించారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం సైతం పూర్తయింది. సర్వేలో గర్భిణులు, బాలింతల మనోగతం ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. అప్పుడే కేంద్రాల్లోనే భోజనం పెడతారా లేక సరకులు ఇంటికే ఇచ్చేస్తారా అన్న విషయంపై స్పష్టత వస్తుంది.

ఏ నిర్ణయమైనా మంచిదే



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి మాతాశిశు మరణాలు లేకుండా చూడాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దాని ప్రకారం నడచుకుంటాం.

- తుమ్మూరి లక్ష్మీ వీర వెంకట సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త, పందలపాక

పక్కాగా సర్వే చేశాం



గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చి భోజనం చేస్తేనే మంచిదన్న విషయాన్ని అనేకసార్లు అవగాహన కల్పించాం. అయినా చాలామంది రావడానికి ఇష్టపడడం లేదు. అందుకే ప్రభుత్వ ఆదేశాలతో లబ్ధిదారుల నుంచి లిఖితపూర్వకంగా వివరాలు తీసుకుని పక్కాగా సర్వే చేశాం.

- శాంతి రత్నకుమారి, సూపర్‌వైజర్, ఊలపల్లి సెక్టార్

నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రామవరం–తాపేశ్వరం రహదారి నిర్మాణ పనుల పరిశీలన

అనపర్తి: రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అధికారులకు సూచించారు. అనపర్తి మండలం రామవరం నుంచి మండపేట మండలం తాపేశ్వరం వరకూ నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ రహదారి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకుని ప్రయాణానికి అనుకూలంగా లేని రామవరం–తాపేశ్వరం రహదారిని రూ.1.10 కోట్లతో బీటీ రోడ్డుగా నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ రహదారి రెండు నియోజకవర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నాణ్యతతో రహదారి పనులు చేపడితే పది కాలాల పాటు మన్నికగా ఉంటాయన్నారు. ఎమ్మెల్యే వెంట అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.


రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

డ్రోన్‌తో ఎరువుల పిచికారీపై అవగాహన


రంపయర్రంపాలెంలో డ్రోన్ సహాయంతో ఎరువులు పిచికారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో రైతులకు డ్రోన్ సహాయంతో ఎరువుల పిచికారీపై గురువారం అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఐసీఏఆర్–సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు డ్రోన్ ఉపయోగించి ఎరువులు ఏ విధంగా పిచికారీ చేయాలో ప్రత్యక్షంగా చూపించారు. సుమారు 25 కేజీల బరువు ఉండే డ్రోన్ సహాయంతో ఒక ఎకరంలో కేవలం 8 నుంచి 10 నిమిషాల్లోనే ఎరువులు పిచికారీ చేయవచ్చన్నారు. తద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోరుకొండ ఏడీఏ బి.మల్లికార్జునరావు, ఏఓ పి.రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ముందజ

- ఇన్‌చార్జి వీసీ ఆచార్య ప్రసాదరాజు
- నన్నయలో మహిళా దినోత్సవం

రాజానగరం: నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. యూనివర్సిటీలో ఉమెన్ ఎంపవర్మెంట్, డవలప్‌మెంట్ అండ్ గ్రీవెన్ సెల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని గోదావరి యూనివర్సిటీ సాధన సమితి ఉపాధ్యక్షురాలు డాక్టర్ పి.చిరంజీవిని కుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆచార్య ప్రసాదరాజు పాల్గొన్నారు. డాక్టర్ చిరంజీవిని కుమారి మాట్లాడుతూ బయాలాజికల్ వ్యత్యాసం మినహా పురుషులకు, స్త్రీలకు మధ్య ఎటువంటి వ్యత్యాసం ఉండకూడదన్నారు. 'నన్నయ'వర్సిటీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులలో అధికంగా మహిళలే ఉండటం హర్షణీయమంటూ విద్యతోనే మహిళ సాధికారత సాధ్యమవుతుందన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సూకరత్నం, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డాక్టర్ వి.పెర్సిస్, చీఫ్ వార్డెన్ డాక్టర్ డి.జ్యోతిర్మయి, ఎస్సీ, ఎస్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.విజయ నిర్మల పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

నేడు సమావేశం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్టు ఆశాఖ మండలాధికారి ఏ.గౌరీదేవి తెలిపారు. మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఆ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, రైతులందరూ హాజరుకావాలని కోరారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్న కాలనీ శివారున పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ గురువారం తెలిపారు. వారి నుంచి రూ.5,100 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని, నిందితులను కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

రాజానగరం: కొత్త వెలుగుబందలో నిర్మించిన బాలాత్రిపుర సుందరి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. మంచినీటి కొలను సమీపంలో దాతల సహకారంతో సుమారు రూ.1.30 కోట్లతో ఈ ఆలయాన్ని నిర్మించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు జక్కంపూడి జగపతి, రాంబాబు, ప్రగడ గోవిందు, పి.రామాంజనేయులు, కూటి ప్రసాద్, అడపా గణేష్, కర్రి వీరభద్రం, కొండలరావు ఉన్నారు. అలాగే స్వామిని ఎంపీ భరత్‌రామ్ దర్శించుకున్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాజా

డ్రోన్ వినియోగంతో ఖర్చుల ఆదా

రాజానగరం: ప్రకృతి వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి, ఖర్చును చాలావరకు తగ్గించవచ్చని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులను చైతన్యపరుస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కేవీకే ఆధ్వర్యంలో గోకవరం మండలం రంపయర్రంపాలెంలో రైతులకు గురువారం డ్రోన్ వినియోగంపై అవగాహన కలిగించారు. డ్రోన్‌ల ద్వారా వివిధ రకాల కషాయాలు, ద్రావణాలు, బయోకల్చర్ మున్నగు వాటిని ఏవిధంగా పిచికారీ చేయవచ్చో ప్రయోగాత్మకంగా చూపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ యూనిట్ (డీపీఎంయూ) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, డీటీ గౌతం, ఎంటీ దుర్గాదేవి, ఎస్‌డీఏ వీరవెంకట్రావు పాల్గొన్నారు.


డ్రోన్ ద్వారా వరి పంటపై ద్రావణాలు పిచికారీ చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ట్రేడ్ యూనియన్ మరింత బలోపేతం


జక్కంపూడి విజయలక్ష్మిని కలిసిన అను, యూనియన్ నాయకులు

సీతానగరం: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు (అను) తెలిపారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు వాటర్ వర్క్స్ రెడ్డి, వైకేఎల్ నరసింహారావు, మేడి త్రిమూర్తులు, కొండ గుంటూరు సర్పంచ్ రామకృష్ణ, ఆటో యూనియన్ నాయకుడు లక్ష్మణ్ తదితరులు రాజమహేంద్రవరంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో కార్మికులకు అన్నివేళలా అందుబాటులో ఉంటానన్నారు.

సచివాలయాల్లో బాధ్యతాయుత సేవలు

సీతానగరం: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు బాధ్యతాయుత సేవలు అందించాలని డీఎల్‌డీవో వీణాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో వీణాదేవి, ఎంపీడీవో కె.రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ ఆయుష్మాన్‌భవ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేలను గడువు సమయంలో పూర్తిచేయాలన్నారు. ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిని ప్రతిఒక్కరూ సంబంధిత సచివాలయాల్లోని ఆధార్ కేంద్రానికి వెళ్లి అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఆర్.సుజాత పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

పెదపూడి: అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధింపులకు పాల్పడుతున్న భర్తపై పెదపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపూడి ఎస్‌ఐ పి.వాసు గురువారం తెలిపిన వివరాల ప్రకారం వేండ్ర గ్రామానికి చెందిన వెన్నపు వెంకన్నతో అంజలి అనే మహిళకు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే వెంకన్న గత కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలని అంజలిని వేధింపులకు గురిచేయడమే కాకుండా ఈ నెల 1న ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ


పెదపూడి సీహెచ్‌సీలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న రమేష్ తదితరులు

పెదపూడి: పెదపూడి సామాజిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ప్రధానమంత్రి టీబీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ మందులు వాడుతున్న వారికి కాకినాడ అపోలో ఆస్పత్రి వారి సహాయంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వేసుకుంటేనే టీబీ నివారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సూజాత, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు జ్యోతి, వెంకటేష్, సూపర్‌వైజర్లు సీహెచ్‌వీ హనుమంతరావు, ఎన్.అనిత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట: జి.దొంతమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. విద్యుత్తు సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని దొంతమూరు, బాలవరం గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

టీడీపీ సమావేశం

సీతానగరం: రాపాకలో సర్పంచ్ గన్నిన బ్రహ్మాజీకి చెందిన ఆవరణలో గురువారం టీడీపీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ప్రసంగించారు. నియోజకవర్గం ఇన్‌చార్జిని తక్షణమే నియమించాలని, ఎవరిని నియమించినా స్వాగతిస్తామన్నారు. దీనిని మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టిలో ఉంచుతామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అనపర్తి: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అనపర్తి యూనిట్ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ వేతన సవరణలకు సంబంధించి 12వ పేకమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో హెల్త్ కార్డులపై క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రామారెడ్డి, సంఘం ప్రతినిధులు ఎస్వీ రామారెడ్డి, గణపతి రామారెడ్డి, నర్సిరెడ్డి, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వకంగా..


జక్కంపూడి గణేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న, కృష్ణారావు

సీతానగరం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌ను ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, భర్త కృష్ణారావు గురువారం రాజమహేంద్రవరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల యువజన విభాగం జోనల్ కో ఆర్డినేటర్‌గా జక్కంపూడి గణేష్ నియామకం హర్షణీయమన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం అందజేత

బిక్కవోలు: రామచంద్రపురం మోడరన్ కాలేజీ అధినేత జీవీ రావు సమకూర్చిన రూ.10 వేల విలువైన స్పోర్ట్స్ యూనిఫాంని మెళ్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు కళాశాల సిబ్బంది గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్ని గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో మెళ్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఎస్ఎస్ మూర్తి, ఎండీ బషీర్, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, కళాశాల అడ్వైజర్ చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ 29వ తేదీకి వాయిదా

సీతానగరం: కాటవరం, ముగ్గళ్ల వద్దగల కొండలను అక్రమంగా తవ్వుతున్నారని వేసిన పిటీషన్‌పై విచారణ జరిపిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఈనెల 29కు వాయిదా వేసిందని పిటీషనర్, లాయర్ చిడిపి నకుల సురేష్ గురువారం తెలిపారు. గతంలో వీటిపై ఎన్‌జీటీని ఆశ్రయించామని, వీటిపై గురువారం విచారణ జరిపారన్నారు. కాటవరం కొండ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని, గత ఏడాది కాలంలో కాటవరం కొండ దగ్గర ఎటువంటి తవ్వకాలు జరపలేదని కలెక్టర్ నివేదిక ద్వారా ఎన్‌జీటికి తెలిపారన్నారు. ముగ్గళ్ల సుద్దకొండ నుంచి లక్ష క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడు దగ్గర రైతులు పొలాలు నింపడానికి వాడారని, సుమారు రూ.3 కోట్లు పన్ను చెల్లించే విధంగా డిమాండ్ నోటీసు పంపామని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ తమ నివేదిక ద్వారా ఎన్జీటీకి తెలియజేయగా, తదుపరి విచారణ ఈనెల 29 కు వాయిదా వేశారన్నారు.

కాపవరంలో రాగి వైరు చోరీ

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో జరిగిన రాగి వైరు చోరీపై కేసు నమోద చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అనపర్తి మండలం శివారు గ్రామమైన కొత్తూరు గ్రామానికి చెందిన పడాల లక్ష్మీనారాయణరెడ్డికి బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో 24 ఎకరాల పొలం ఉంది. గత నెల 28వ తేదీ రాత్రి తన పొలంలోని బోరుకి చెందిన రాగి కేబుల్ వైరుని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లుగా ఆయన ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా వేణుగోపాలస్వామి పుష్పయాగం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి పుష్పయాగం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు అంగర శ్రీధర్ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని నల్గొండకు చెందిన బందిలి వీర్రాజు (25) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై కె.శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన వీర్రాజును భార్య లక్ష్మి, తండ్రి మందలించడంతో బుధవారం సాయంత్రం గడ్డిమందు తాగాడు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.